సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 12 । మే । 2024



భువనగిరి ఖిల్లా ఎవరిదో!

భువనగిరి లోక్‌సభ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరికి వారు గెలుపుపై ధీమాతో ఉన్నారు. 2లో▸



సతుల్.. సుతుల్.. హితుల్..

ఎన్నికల ప్రచారంలో అటు అభ్యర్థులతోపాటు ఇటు కుటుంబసభ్యులు, బంధుగణం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. 2లో▸



రూ.11.9 కోట్లు స్వాధీనం

రాచకొండ పోలీసులు అడుగడుగునా నిఘా పెట్టారు. ఇప్పటివరకు పెద్ద మొత్తంలో నగదు స్వాధీనం చేసుకున్నారు. 2లో▸

న్యూస్‌రీల్

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు



మాల్ చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

యాచారం: ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే బాధ్యులపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. రంగారెడ్డి–నల్లగొండ జిల్లాల సరిహద్దు మాల్ కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టును శనివారం ఆయన సందర్శించారు. సాగర్‌రోడ్డుపై రాకపోకలు సాగించే వాహనాల తనిఖీని పరిశీలించారు. ఈ నెల 13న లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉన్న దృష్ట్యా ఆ రోజు సాయంత్రం 6 గంటల వరకు గట్టి నిఘా ఉంచాలని, ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి పంపించాలని సిబ్బందికి సూచించారు. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో 49 సమస్యాత్మక గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న దృష్ట్యా నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యాచారం సీఐ శంకర్‌కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ గుంతలో మునిగి విద్యార్థి గల్లంతు



నితిన్ (ఫైల్)

కేశంపేట: వేసవికాలం కావడంతో స్నేహితులతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన విద్యార్థి గల్లంతైన సంఘటన మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామ శివారులో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పుట్టోనిగూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కాంకిరాళ్లతండాకు చెందిన మూడవత్ సుశీల, రాజుకు ఇద్దరు ఆడపిల్లలు, నితిన్ సంతానం. నితిన్ షాద్‌నగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం ఉదయం దత్తాయపల్లి గ్రామ శివారులో ఉన్న క్వారీలోకి స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. బట్టలు, చెప్పులను క్వారీ దగ్గర ఉంచి, పై నుంచి క్వారీ గుంతలోకి దూకిన తర్వాత పైకి రాకపోవడంతో అక్కడే ఉన్న స్నేహితులు గుర్తించి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గ్రామస్తుల సహకారంతో క్వారీలో వెతికారు. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వారు వచ్చి గాలించినా మృతదేహం లభ్యం కాలేదు. ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బందికి కూడా సమాచారం అందించినట్టు పోలీసులు తెలిపారు. ఈ మేరకు నితిన్ తండ్రి రాజు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటర్లను ప్రలోభపెడితే చర్యలు తప్పవు

ఎన్నికల వ్యయ పరిశీలకుడు కుమార్ రాకేష్ రాజన్




చెక్‌పోస్టును పరిశీలిస్తున్న కుమార్ రాకేష్ రాజన్

ఇబ్రహీంపట్నం రూరల్: లోక్‌సభ ఎన్నికల వేల ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల వ్యయ నియంత్రన పరిశీలకుడు కుమార్ రాకేష్ రాజన్ పేర్కొన్నారు. ఆదిబట్ల మున్సిపల్ పరిధిలోని బొంగ్లూర్‌లో ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఎన్ని వాహనాలు తనిఖీ చేశారు.. పట్టుబడిన నగదెంత అని అడిగి తెలుసుకున్నారు. రెండు రోజులు చాలా కీలకమని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అనంతరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

శేరిగూడ పోలింగ్ కేంద్రం పరిశీలన

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల వ్యయ పరిశీలకుడు కుమార్ రాకేష్ రాజన్ శనివారం మండల పరిధిలోని శేరిగూడను సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి అధికారులకు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనంతరెడ్డి తదితరులు ఉన్నారు.

సప్పుడు బంద్



మూగబోయిన మైక్‌లు

- ముగిసిన లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- చివరి రోజు హోరెత్తించిన పార్టీలు
- ఓట్ల వేటలో ప్రధాన పార్టీల అభ్యర్థులు
- ఇక పోల్‌మేనేజ్‌మెంట్‌పై దృష్టి
- ప్రలోభాల పర్వం మొదలు
- బూత్‌ల వారీగా ఓటర్లకు తాయిలాలు!

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల ప్రచారం ముగిసింది. ఎక్కడి ప్రచార రథాలు అక్కడే నిలిచిపోయాయి. శనివారం సాయంత్రం 6 గంటల వరకు హోరెత్తించిన మైక్‌లు ఆరు తర్వాత మూగబోయాయి. సోమవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనుంది. ప్రచారం ముగియడంతో ప్రధాన రాజకీయ పార్టీల నాయకులు పోల్ మేనేజ్‌మెంట్‌పై దృష్టి సారించారు. పోలింగ్ బూతుల వారీగా ఓటర్లకు ఓటరు స్లిప్పులతో పాటు గుట్టుగా నగదు, మద్యం సీసాల పంపిణీకి తెరలేపారు. పేదలు ఎక్కువగా నివసించే బస్తీలు, మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రవాహం ఎక్కువగా జరుగుతోంది. ఎన్నికల్లో ఓటర్లను ప్రభావితం చేసే అంశాలను నియంత్రించేందుకు ఎన్నికల కమిషన్ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినప్పటికీ, వారి కళ్లుగప్పి నగదు ప్రవాహం కొనసాగుతోంది. అభ్యర్థుల బంధువులు, స్నేహితులతో పాటు పార్టీ ముఖ్య నాయకులు, అనుచరులు ఓటర్లను ప్రభావితం చేసే పనిలో నిమగ్నమయ్యారు.

ఫైనల్ టచ్ ఇచ్చిన అగ్రనేతలు

చేవెళ్ల లోక్‌సభ స్థానాన్ని అధికార కాంగ్రెస్ సహా ప్రతిపక్ష బీఆర్‌ఎస్, బీజేపీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. బీజేపీ నుంచి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి కాసాని జ్ఞానేశ్వర్ బరిలోకి దిగారు. ఆయా పార్టీల ముఖ్య నేతలు అభ్యర్థుల తరఫున విస్తృతంగా ప్రచారం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి చేవెళ్ల కేంద్రం నుంచి ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టారు. సెగ్మెంట్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో రోడ్‌షోలు, కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. తుక్కుగూడ వేదికగా కాంగ్రెస్ జాతీయ గ్యారంటీలను ప్రకటించింది. ఏఐసీసీ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ వంటి ముఖ్య నేతలు పర్యటించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన బస్సు యాత్ర చేవెళ్ల నుంచే మొదలు పెట్టారు. బీజేపీ నుంచి కేంద్ర మంత్రులు సహా బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు ప్రచారం చేశారు. ఎన్నికల ప్రచారంలో చివరి రోజైన శనివారం తాండూరులో ప్రియాంకగాంధీ ప్రచారం చేశారు. వికారాబాద్‌లో అమిత్‌షా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల అంకానికి ఫైనల్ టచ్ ఇచ్చారు.

రూ.40.72 కోట్లకుపైగా సీజ్

ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత పోలీసులు, రిటర్నింగ్ అధికారుల తనిఖీల్లో జిల్లాలో భారీగా నగదు పట్టుబడింది. రూ.50 వేలకు మించిన నగదు సహా కొనుగోలు రసీదు చూపని బంగారు ఆభరణాలను అధికారులు సీజ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా 1,534 కేసుల్లో రూ.49.72 కోట్లకుపైగా నగదు, బంగారం, ఇతర వస్తువులు పట్టుబడినట్లు రిటర్నింగ్ అధికారి శశాంక వెల్లడించారు. శనివారం సాయంత్రం నుంచి సోమవారం ఓటింగ్ ప్రక్రియ ముగిసే వరకు జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై నిఘా ఉంటుందని ప్రకటించారు.

పట్టుబడినవి ఇలా..

అంశం	పట్టుబడ్డవి	విలువ
నగదు	19	రూ.10,70,16,937
బంగారం	4,639.8682 గ్రాములు	రూ.31,14,44,388
వెండి	8,900 గ్రాములు	రూ.30,34,700
మద్యం	7,702.905 లీటర్లు	రూ.17,61,20,026
డ్రగ్స్	846.8203 కేజీలు	రూ.5,05,03,026
చీరలు, ఇతర వస్తువులు	20 కేసులు	రూ.76,01,011



సభకు హాజరైన జనం

‘జన’జాతర

- కార్యకర్తల్లో జోష్ నింపిన ప్రియాంక గాంధీ
- సీఎం రేవంత్ ప్రసంగానికి అభిమానుల కేరింతలు
- సభ సక్సెస్‌తో నేతల సంబరాలు



మాట్లాడుతున్న ప్రియాంక గాంధీ, చిత్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి

తాండూరు: కాంగ్రెస్ పార్టీ శనివారం తాండూరు పట్టణంలో నిర్వహించిన జనజాతర సభ విజయవంతమైంది. ప్రియాంక గాంధీ ప్రసంగం పార్టీ అభిమానులు, కార్యకర్తలు, ప్రజల్లో ఉత్సాహాన్ని నింపింది. పట్టణంలోని విలియం మూన్ స్కూల్ మైదానం జనాలతో నిండిపోయింది. ఉదయం 10 గంటలకే వేలాది మంది తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి జన సమీకరణలో సక్సెస్ అయ్యారు. మధ్యాహ్నం 3.15 గంటలకు హెలిక్యాప్టర్‌లో ప్రియాంక గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డితోపాటు అగ్రనేతలు సభాస్థలికి చేరుకున్నారు. ముందుగా ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గాంధీ కుటుంబాన్ని గెలిపించాలని కోరారు. ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి బీజేపీ వ్యతిరేక విధానాలను ఎండగట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ప్రారంభించగానే అభిమానులు పెద్ద ఎత్తున కేకలు వేశారు. ముఖ్యమంత్రి బీజేపీపై విమర్శనాస్త్రాలు సంధించారు.

సభ ఆలస్యం కావడంతో..

ప్రియాంక గాంధీ జనజాతర సభ ఆలస్యంగా ప్రారంభం కావడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సభ సాయంత్రం నాలుగు గంటలకు మొదలైంది. ఉదయం 10 గంటలకే గ్రామాల నుంచి తాండూరుకు వచ్చిన జనం నేతల కోసం నిరీక్షించక తప్పలేదు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ప్రియాంక గాంధీ ప్రసంగించే సమయానికి సభలో చాలా కుర్చీలు ఖాళీగా కనిపించాయి.



మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మోసంతో అధికారంలోకి కాంగ్రెస్

భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

ఇబ్రహీంపట్నం: మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారం చేపట్టిందని భువనగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్ ఆరోపించారు. ఇబ్రహీంపట్నంలో శనివారం పార్టీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బూర నర్సయ్యగౌడ్ మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓసారి కాంగ్రెస్‌కు ఓటు వేసి ఒక కన్ను పొడుచుకున్నామని.. మళ్లీ ఈసారి ఓటు వేసి రెండో కన్ను పొడుచుకోవద్దన్నారు. దేశం, ధర్మం, అభివృద్ధే లక్ష్యంగా మోదీ పాలన కొనసాగుతోందన్నారు. దేశం బాగుండాలంటే మోదీ అధికారంలో ఉండాలన్నారు. అవినీతి రహిత పాలన కావాలో.. కుంభకోణాల ఇండియా కూటమి పాలన కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. రాహుల్ గాంధీ గుండె లబ్‌డబ్ అంటూ కొట్టుకోవడం లేదని.. మోదీమోదీ అంటూ కొట్టుకుంటోందని అన్నారు. మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం మార్చుతారని, రిజర్వేషన్లు రద్దు చేస్తారని, అరాచకం సృష్టిస్తారని విష ప్రచారం చేస్తున్నారని దానికి ఓటుతోనే బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాను గెలిస్తే ఇబ్రహీంపట్నం పేరును వీరపట్నంగా మార్చి చట్టబద్ధత కల్పిస్తానన్నారు. ప్రజలందరికీ అందుబాటులో ఉండి సేవ చేస్తానని.. కమలం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నాయిని సత్యనారాయణ, ముత్యాల భాస్కర్, దయానంద్‌గౌడ్, పోరెడ్డి నర్సింహారెడ్డి, అర్జున్‌రెడ్డి, భోజిరెడ్డి, యాదగిరిరెడ్డి, గగనమోని సతీష్ తదితరులు పాల్గొన్నారు.

కమలం శ్రేణుల్లో జోష్

అమిత్ షా వికారాబాద్ సభ విజయవంతం

- నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపిన ప్రసంగం
- మోదీ, జై శ్రీరాం నినాదాలతో హోరెత్తిన సభ

వికారాబాద్: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా వికారాబాద్ సభ సక్సెస్ అయ్యింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టణంలోని ఎస్ఏపీ కళాశాల మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాతో బీజేపీ చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి కుటుంబానికి ఉన్న సంబంధాన్ని వివరిస్తూ అమిత్ షా ప్రసంగం సాగింది. ఉమ్మడి ఏపీ ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన కొండా వెంకట రంగారెడ్డికి నివాళులర్పించారు. అంతటి ఉన్నత విలువలు గల కుటుంబానికి చెందిన వ్యక్తి అయిన మన అభ్యర్థి కొండాను గెలిపించాలని కోరారు. మధ్యాహ్నం 12.05 గంటలకు సభాస్థలికి చేరుకున్న ఆయన ప్రజలకు అభివాదం చేసి ప్రసంగాన్ని ప్రారంభించారు. 12.35 గంటలకు సభ ముగిసింది. అంతకుముందు లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, గుల్బర్గా ఎంపీ ఉమేశ్ జాదవ్, మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, వీరేందర్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. దేశ అభివృద్ధి, అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. అవినీతి మరక లేని నాయకుడు మోదీ అని అభివర్ణించారు. తెలంగాణకు బీజేపీకి విడదీయరాని అనుబంధనం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత ఎన్నికల్లో డబుల్ డిజిట్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. యావత్ దేశం మోదీ వైపు చూస్తోందని, హ్యాట్రిక్ పీఎం కావడం ఖాయమన్నారు.

ఉర్రూతలూగించిన షా ప్రసంగం

స్టేజీపైకి వచ్చింది మొదలు సభ ముగిసే వరకు అమిత్ షా ప్రసంగం ఆద్యంతం ప్రజలు, కార్యకర్తలను ఉర్రూతలూగించింది. జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలతో పాటు పొరుగు దేశాలు, కాశ్మీర్, పాక్ ఆక్రమిత కాశ్మీర్, ఉగ్రవాదులు, నక్సలిజం గురించి మాట్లాడారు. కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు, రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి, కేసీఆర్, ఒవైసీ, మజ్లీస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. ప్రసంగం మొత్తం రాహుల్ బాబా అంటూనే సాగింది. ఆర్ ఆర్ టాక్స్ వేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ, రంగారెడ్డి జిల్లాల్లో ఉన్న ప్రధాన ఆలయాలు, దేవతామూర్తుల పేర్లు ప్రస్తావిస్తూ ఉత్సాహ పరిచారు. భారత్ మాతాకీ జై.. వందే మాతరం.. జై శ్రీరాం అంటూ నినదించారు. మధ్య మధ్యలో కార్యకర్తలు ప్రధాని మోదీ, అమిత్ షా పేర్లతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఓవరాల్‌గా అమిత్ షా ప్రసంగం బీజేపీ కార్యకర్తలకు మరింత బూస్టింగ్ ఇచ్చినట్టయ్యింది.

భారీగా జన సమీకరణ

బీజేపీ నేతలు అనుకున్న స్థాయిలో సభ సక్సెస్ అయ్యింది. నాయకులు భారీగా జనాలను సమీకరించటంలో విజయవంతం అయ్యారు. లోక్‌సభ పరిధిలోని చేవెళ్ల, పరిగి, వికారాబాద్, తాండూరు నియోజకవర్గాల నుంచి కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అనుకున్న స్థాయిలో జనాలు రావటంతో ఆ పార్టీ నాయకులు, అభ్యర్థి సైతం ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, పార్టీ చేవెళ్ల లోక్‌సభ కన్వీనర్ మల్లారెడ్డి, రంగారెడ్డి రూరల్ అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, వీరేందర్‌గౌడ్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రహ్లాద్‌రావు, అంజన్‌కుమార్, గుమ్మడి రాచంద్రారెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజు, రమేష్‌కుమార్, మిట్ట పరమేశ్వర్‌రెడ్డి, అసెంబ్లీ ప్రభారీలు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బాలరాజు, రాజవర్ధన్, లోక్‌సభ ప్రభారి విష్ణువర్ధన్‌రెడ్డి, జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, నాయకులు వడ్ల నందు, నవీన్‌కుమార్, విశ్వజిత్‌రెడ్డి, సునీతారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన మహిళలు

స్వేచ్ఛగా ఓటు వేయాలి

- ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి
- సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా
- కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఈ నెల 13న జరుగనున్న పోలింగ్‌లో ప్రతి ఓటరు పాలుపంచుకుని, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ శశాంక పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజేంద్రనగర్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. ఓటరు కార్డు లేకపోయినా, ఎన్నికల సంఘం నిర్దేశించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి వెంట తెచ్చుకుని ఓటు వేయొచ్చని సూచించారు. జిల్లాలో పోలింగ్ శాతం పెంచేందుకు ఇప్పటికే అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రచార, అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్టు చెప్పారు. గత ఎన్నికల్లో తక్కువ పోలింగ్ నమోదైన అర్బన్ ప్రాంతాల్లో ప్రత్యేకంగా దృష్టి సారించినట్టు పేర్కొన్నారు. ప్రలోభాలకు ఆస్కారం లేకుండా పోలింగ్‌కు 72 గంటల ముందు నుంచి నిఘా ముమ్మరం చేసినట్టు కలెక్టర్ తెలిపారు. లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో మొత్తం 2,877 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని.. ప్రతి పోలింగ్ కేంద్రంలో టెంట్లు, టాయిలెట్, ర్యాంపు, వీల్ చైర్, తాగునీరు, ఫ్యాన్ వంటి వసతులు కల్పించినట్టు వెల్లడించారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా, సీసీ కెమెరాల నిఘా నీడలో పోలింగ్ ఉంటుందన్నారు. 216 మంది సూక్ష్మ పరిశీలకులు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో సేవలందిస్తారని ఆయన వివరించారు.

విధుల్లో 23 వేల మంది ఉద్యోగులు

ఎన్నికల విధుల్లో 23,752 మంది పాల్గొననున్నట్టు కలెక్టర్ శశాంక తెలిపారు. సెక్టోరియల్, ప్రిసైడింగ్ ఆఫీసర్, సహాయ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చామని.. వీరంతా ఆదివారం ఉదయం ఆయా పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, బ్యాలెట్ బాక్సులను తీసుకుని కేటాయించిన పోలింగ్ కేంద్రానికి చేరుకుంటారన్నారు. పోలింగ్ రోజున ఉదయం 5.30 గంటలకు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో మాక్‌పోల్ ఉంటుందన్నారు. మాక్‌పోల్, పోలింగ్ ప్రక్రియలో ఏదైనా సాంకేతిక లోపం తలెత్తితే వెంటనే సెక్టోరల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని, వీరు తమ వద్ద రిజర్వ్‌లో ఉంచిన యూనిట్లను సమకూర్చుతారని చెప్పారు. పోలింగ్ రోజున ఓటింగ్ శాతాన్ని ప్రతి గంటకోసారి ఎన్‌కోర్ యాప్‌లో నమోదు చేయాలని, డాక్యుమెంట్, పీఓ డైరీ, విజిట్ షీట్, మాక్ పోల్ సర్టిఫికెట్, 17 కాలమ్ ప్రొఫార్మా వంటివి తప్పులు లేకుండా చూడాలన్నారు. పోలింగ్ ముగిసిన మీదట ఈవీఎంలను జాగ్రత్తగా రిసెప్షన్ సెంటర్లకు చేర్చాలని, వాటిని సరిచూసుకుని స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపరిచే వరకు సెక్టోరల్ అధికారులు అక్కడే అందుబాటులో ఉంటారని వివరించారు.

మూడో విడత ర్యాండమైజేషన్ పూర్తి

ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శనివారం పోలింగ్ సిబ్బంది మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో పూర్తి చేశారు. రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక నేతృత్వంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఎన్ఐసీ హాల్‌లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ప్రక్రియ పూర్తి చేశారు. సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా కార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించారు. ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులను, ఓపీఓలతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే పలు విడతలుగా ఎంపిక చేసిన వివిధ కేంద్రాల్లో మాస్టర్ ట్రైనర్స్‌తో శిక్షణ తరగతులు నిర్వహించారు. జిల్లాలోని ఆయా నియోజకవర్గాల పరిధిలో మొత్తం 3,459 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 3,796 టీములను పోలింగ్ విధుల కోసం నియమించినట్టు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గం పరిధిలో ప్రత్యేకంగా ఐదు పోలింగ్ కేంద్రాల చొప్పున మహిళా బృందాలు, ఒక దివ్యాంగుల బృందం, ఒక యువతతో కూడిన పోలింగ్ బృందాలను ఎంపిక చేసినట్టు చెప్పారు. ఈ సందర్భంగా మైక్రో అబ్జర్వర్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను సైతం పూర్తి చేశారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ సంగీత, ఎన్ఐసీ అధికారి స్వర్ణలత, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ నోడల్ అధికారి శ్రీలక్ష్మి, ఎన్నికల విభాగం అధికారి సైదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గం	ఓటింగ్ కిట్ల పంపిణీ కేంద్రం	స్ట్రాంగ్‌రూమ్స్/కౌంటింగ్ కేంద్రం
మహేశ్వరం	స్ఫూర్తి ఇంజనీరింగ్ కాలేజీ, నాదర్‌గుల్	బండారి శ్రీనివాస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గొల్లపల్లి
రాజేంద్రనగర్	ఓల్డ్ వెటర్నరీ కాలేజీ, రాజేంద్రనగర్	,,
శేరిలింగంపల్లి	జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియం, గచ్చిబౌలి	,,
చేవెళ్ల	బండారి శ్రీనివాసరావు ఇనిస్టిట్యూట్, గొల్లపల్లి	,,
పరిగి	మినీ స్టేడియం, పరిగి	,,
వికారాబాద్	మేరీ ఏ నాట్స్ స్కూల్స్	,,
తాండూరు	సెయింట్ మార్క్స్ ఇంటర్నేషనల్ హైస్కూల్	,,

ఓటేయండి.. రాయితీ పొందండి

పోలింగ్ శాతం పెంచేందుకు స్పెషల్ ఆఫర్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్‌లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం, స్వచ్ఛంద సంస్థలూ నడుం బిగించాయి. రకరకాల ఆఫర్లతో ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇప్పటికే కమ్యూనిటీ యాప్ ర్యాపిడో ఓటర్లను పోలింగ్ రోజున ఉచితంగా సేవలు అందించేందుకు తెలంగాణ ఎన్నికల సంఘంతో ఒప్పందం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ నెల 13న ఓటర్లు ర్యాపిడో యాప్‌లో 'ఓట్ నౌ' కోడ్‌ను ఉపయోగించి ఉచితంగా బైక్, ఆటో, క్యాబ్ సేవలను అందుకోవచ్చు. తాజాగా అమ్యూజ్‌మెంట్ పార్క్ వండర్‌లా ఓటర్లకు ప్రత్యేక ఆఫర్‌ను ప్రకటించింది. వేలిపై సిరా చుక్కను చూపిస్తే వండర్‌లా టికెట్‌పై 20 శాతం రాయితీని ప్రకటించింది. ఈ నెల 13 నుంచి 15 తేదీల్లో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని వండర్‌లా హాలిడేస్ ఎండీ అరుణ్ చిట్టిలపిల్లి ఒక ప్రకటనలో తెలిపారు. మరోవైపు ప్రముఖ డైనింగ్ ఔట్ ప్లాట్‌ఫాం స్విగ్గీ డైన్‌ఔట్ భోజన ప్రియులకు భలే ఆఫర్‌ను ప్రకటించింది. ఓటర్లు వేలి పై సిరా చుక్కను చూపించి స్విగ్గీ డౌన్‌ఔట్‌లోని ఎంపిక చేసిన రెస్టారెంట్ల బిల్లులో 50 శాతం తగ్గింపు ఆఫర్‌ను అందిస్తుంది. అంతేరా కిచెన్ అండ్ బార్, పపాయ, ఎయిర్ లైవ్, ఫుడ్ ఎక్స్ఛేంజ్–నోవాటెల్, రెడ్ రీనో, కాఫీ కప్ వంటి పలు రెస్టారెంట్లలో ఈ ఆఫర్‌ను అందుకోవచ్చని స్విగ్గీ డౌన్‌ఔట్ హెడ్ స్వప్నిల్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంతిమ నిర్ణయం ఓటరుదే..

సాక్షి, సిటీబ్యూరో: పార్టీలు ఇచ్చే తాయిలాలు, నజరానాలు, నగదు, మద్యం సంగతి ఎలా ఉన్నా చివరకు ఏ ఓటరు ఎటు వైపు మొగ్గు చూపుతాడో తెలియదు. ఏ పార్టీకి పట్టం కడతాడో తెలియదు. కానీ ఇప్పటి వరకు ప్రచారం చేసిన అన్ని పార్టీలు తామే గెలుస్తామనే ధీమాతోనే ఉన్నాయి. లోక్‌సభలో అడుగుపెట్టబోతున్నామనే అంచనాలతోనే అభ్యర్థులు కలలు కంటున్నారు. ఆ కలలు ఏ తీరాలకు చేరుతాయో తెలియాలంటే మే 13న నమోదు కానున్న తీర్పు కోసం జూన్ 4 వరకు వేచి చూడాల్సిందే.

అమిత్‌షాకు ఆహ్వానం



అమిత్‌షాతో స్వామి నారాయణ గురుకుల్ స్వామిజీలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లోని ఇంటర్నేషనల్ స్వామి నారాయణ గురుకుల్ పాఠశాలను సందర్శించాలని కేంద్రం హోంమంత్రి అమిత్ షాను సుక్ వల్లభ్ స్వామి, కృష్ణచరణ్‌దాస్ స్వామి కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హైదరాబాద్‌కు వచ్చిన ఆయన్ను శనివారం స్వామిజీలు కలిసి గురుకుల్‌లో విద్యాభివృద్ధికి వారు చేస్తున్న కృషిని వివరించారు. అనంతరం షాను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిని అమిత్ షా అభినందించారు.

భువనగిరి ఖిల్లా ఎవరిదో!

ఇబ్రహీంపట్నం సెగ్మెంట్‌లో పోటీ త్రిముఖం

ఇబ్రహీంపట్నం: లోక్‌సభ ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలకు ముగిసింది. నాలుగైదు రోజులుగా ఎన్నికల ప్రచారంతో పల్లె, పట్టణం, ఊరు వాడ హోరెత్తింది. బైక్ ర్యాలీలు, మైక్ సౌండ్ రికార్డులు, కార్నర్ మీటింగ్‌లు, రోడ్డు షోలు ఇంటింటి ప్రచారంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా పార్టీ శ్రేణులు శతవిధాల ప్రయత్నాలు చేశారు. ఇబ్రహీంపట్నం నియోజవర్గం భువనగిరి లోక్‌సభ పరిధిలో ఉంటుంది. కాంగ్రెస్ నుంచి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, బీఆర్‌ఎస్ నుంచి క్యామ మల్లేశ్, సీపీఎం నుంచి ఎండీ జహంగీర్ ప్రధాన పార్టీ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన క్యామ మల్లేశ్ బీఆర్‌ఎస్ నుంచి లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఒకింత ఉత్సాహం నింపింది. ఈ సెగ్మెంట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి రంగారెడ్డి ఉండటం, రాష్ట్రంలో ఆ పార్టీ అధికారంలో చేపట్టడం కాంగ్రెస్‌కు కలిసొచ్చే అంశం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలతోపాటు చేయబోయే ఆరు గ్యారంటీల గురించి ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ శ్రేణులు ప్రచారం చేశారు. బీజేపీ నుంచి పోటీ చేస్తున్న బూర నర్సయ్యగౌడ్ గతంలో ఎంపీగా పని చేయడంతో ఇక్కడి ప్రజలకు సుపరిచితులు. అప్పట్లో ఆయన చేసిన పనులతోపాటు ప్రధాని మోదీ దేశ ప్రజల కోసం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రచార అస్త్రాలుగా ఉపయోగించుకున్నారు. మోదీ చరిష్మాతోనే విజయం సాధిస్తామనే ధీమాలో బీజేపీ శ్రేణులున్నాయి. ఈ నియోజకర్గం పరిధిలో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్‌ల మధ్యనే ప్రధానంగా పోటీ నెలకొని ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కంటే లోక్‌సభ అభ్యర్థుల ప్రచారం మొదట్లో మందకొడిగా సాగిన చివరి దశలో ఊపందుకుంది. సోమవారం పోలింగ్, జూన్ 4న జరిగే ఓట్ల లెక్కింపుతో నియోజకవర్గంలో ఎవరు పైచేయి సాధిస్తారో స్పష్టం కానుంది.



రూ.16,143 విలువైన మద్యం సీజ్

యాచారం: హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కర్తమేడిపల్లి గ్రామంలో శనివారం రూ.16,143 విలువైన మద్యాన్ని పట్టుకున్నట్లు సీఐ నర్సింహరావు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయిస్తున్న పద్మ, గీతాబాయిలను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వృద్ధురాలి పుస్తెలతాడు చోరీ

శంషాబాద్ రూరల్: నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడుతో పాటు సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లిన ఘటన సుల్తాన్‌పల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాటకారి లక్ష్మి (60) శుక్రవారం రాత్రి భోజనం చేసి మేడపై నిద్రించింది. తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తి మేడపైకి వచ్చి.. ఆమె మెడలో ఉన్న 4 తులాల బంగారు పుస్తెల తాడును ఎత్తుకెళ్లాడు. గమనించిన లక్ష్మి దుండగుడిని పట్టుకునేందుకు యత్నించినా.. తప్పించుకున్నాడు. అంతేగాకుండా ఇంట్లోని సెల్‌ఫోన్‌ను కూడా దోచుకెళ్లినట్లు గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

రోడ్డు తవ్వకంపై ఫిర్యాదు

శంషాబాద్: పట్టణంలోని ఎయిర్‌పోర్టు ముఖ ద్వారం వద్ద ఉన్న ప్రధాన రహదారి పక్కనే గల రోడ్డును ఓ రిటైర్డ్ అధికారి తవ్వించాడని పక్కనే ఉన్న భూ యజమాని ఫసీయుద్దీన్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎయిర్‌పోర్టు నిర్మాణం సమయంలో రోడ్డులో సంబంధిత వ్యక్తి భూమిని సేకరించినప్పటికీ ఆయన ప్రస్తుతం ఉన్న రహదారి కూడా తనదేనని వాదిస్తున్నారన్నారు. దీనిపై రెవెన్యూ, పోలీసులు స్పందించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. రహదారిని అడ్డంగా తవ్వడం వల్ల ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు.

రైల్వేస్టేషన్‌లో ప్రత్యేక భద్రతా చర్యలు

సికింద్రాబాద్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఒక్కమారుగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగింది. పొరుగు జిల్లాలు, పొరుగు రాష్ట్రాల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు తరలి వెళ్లేందుకు పెద్దసంఖ్యలోని ప్రయాణికులు రైల్వేస్టేషన్‌కు తరలివస్తున్నారు. ప్రయాణికులకు భద్రత కల్పించడం, గందరగోళ పరిస్థితులు నివారించడం కోసం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు శనివారం ప్రత్యేక చర్యలు అమలులోకి తెచ్చారు. ఆర్పీఎఫ్ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ బీఎస్ సరస్వత్ నేతృత్వంలో 60 మంది అదనపు రక్షణ బలగాన్ని రైల్వేస్టేషన్‌కు తరలించారు. రైళ్లు వచ్చి వెళ్లే సమయంలో ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ప్రయాణికుల క్యూ లైన్లు ఏర్పాటు చేసి గందరగోళ పరిస్థితులను నివారిస్తున్నారు. చోరీలు జరుగకుండా ఉండేందుకు గస్తీని పెంచారు. ప్రయాణికులకు ఇబ్బందులు ఎదురైనా 139 టోల్ ఫ్రీ నెంబర్‌కు డయల్ చేసి ఆర్పీఎఫ్ పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు.

57 రోజుల్లో రూ.11.9 కోట్లు స్వాధీనం

- రూ.2 కోట్ల విలువైన మాదక ద్రవ్యాలు కూడా
- రాచకొండలో 533 సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు
- ఆరు వేల మంది పోలీసులతో ఎన్నికల బందోబస్తు
- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: లోకసభ ఎన్నికల్లో రాచకొండ పోలీసులు అడుగడుగునా నిఘా పెట్టారు. కమిషనరేట్ పరిధిలో మొత్తం 8 అంతర్ జిల్లా చెక్ పోస్ట్‌లను, 29 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 25 స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రారంభమైన మార్చి 16 నుంచి ఇప్పటివరకు రాచకొండ కమిషనరేట్ పరిధిలో రూ.11.9 కోట్ల నగదు పట్టుబడింది. అలాగే రూ.2 కోట్లు విలువైన గంజాయి, ఓపియం, ఎండీఎంఏ, హెరాయిన్ వంటి మాదక ద్రవ్యాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు రూ.75.78 లక్షల విలువైన 12,240 లీటర్ల మద్యం, రూ.14.7 లక్షల విలువైన ఆభరణాలతో పాటు రూ.9.26 లక్షల విలువైన వస్తువులను తనిఖీలలో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను రాచకొండ పోలీసు కమిషనర్ తరుణ్ జోషి శనివారం మీడియాకు వెల్లడించారు. దేశంలోనే అతిపెద్ద పోలీసు కమిషనరేట్ అయిన రాచకొండలో 62 లక్షల జనాభా ఉండగా.. 35.27 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. కమిషనరేట్ పరిధిలో ఐదు లోక్‌సభ, 13 శాసనసభ నియోజకవర్గాలున్నాయి. మొత్తం 3,396 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయగా.. వీటిలో 533 క్రిటికల్ స్టేషన్లున్నాయి. ఆయా కేంద్రాలను జియో ట్యాగింగ్ చేశారు.

- కమిషనరేట్ పరిధిలో మొత్తం 1,114 లైసెన్స్‌డ్ ఆయుధాలు ఉండగా.. వీటిలో 806 ఆయుధాలు పోలీసుల వద్ద డిపాజిట్ అయ్యాయి. మిగిలినవి ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం మినహాయింపు ఇచ్చారు. 1,036 మందిపై నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేయగా..4,892 మంది అనుమానితులు, రౌడీ షీటర్లను బైండోవర్ చేశారు. ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించిన 14 మందిపై కేసులు నమోదు చేశారు.
- 8 డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, కలెక్షన్ సెంటర్లను, మూడు స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికల బందోబస్తులో 6 వేల మంది సిబ్బంది పాల్గొననున్నారు. ఐటీ బృందంలోని 72 మంది పోలీసులు ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షిస్తుంటారు.

ప్రచారంలో మాటల తూటాలు

గతానికి భిన్నంగా అంశాల ప్రస్తావన

సాక్షి, సిటీబ్యూరో: మహాభారత కురుక్షేత్రంలో యోధానుయోధులు పాల్గొన్నట్లే.. ప్రజాస్వామ్య రణక్షేత్రంలో తమ పార్టీని గెలిపించేందుకు అతిరథ మహారథులు ప్రచార పర్వంలో పాల్గొన్నారు. ప్రజలను ఆకట్టుకునేందుకు తాము అమలు చేయబోయే సంక్షేమ కార్యక్రమాల కంటే ప్రత్యర్థులను మట్టి కరిపించేందుకు మాటల తూటాలనే ప్రధాన ఆయుధాలుగా మలచుకున్నారు. నువ్వొకటంటే నేను రెండంటా అన్న చందంగా అవినీతి, రిజర్వేషన్లు, కరెంటు, రాజ్యాంగం, యూటీ తదితర అంశాలను ప్రస్తావించారు. గ్రేటర్ పరిధిలో 4 లోక్‌సభ నియోజకవర్గాలున్నాయి. ఇక్కడ గెలిస్తే మూడొంతుల ప్రజల మనసులు గెలుచుకున్నట్లు కావడంతో ప్రత్యేక శ్రద్ధ చూపారు. పాతబస్తీ పరిధిలో సైతం గతానికి భిన్నంగా పరిస్థితి మారింది. ప్రచారం కంటే చేసే పనులే గెలిపిస్తాయని నమ్మే మజ్లిస్ పార్టీ సైతం ఈసారి ప్రచారంలోకి దిగడం పోటీ తీవ్రతను చాటింది. మిగతా మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఆర్‌ఎస్ హోరాహోరీ ప్రచారాలతో దుమారం రేపాయి.

ప్రధాని మోదీ, అమిత్ షా..

ప్రధాని మోదీ గ్రేటర్ పరిధిలోని నియోజక వర్గాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. మల్కాజిగిరిలో రోడ్‌షోలో, ఎల్బీ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొని ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వంలో కీలకంగా వ్యవహిస్తున్న హోంమంత్రి అమిత్‌షా ఓల్డ్‌సిటీలో రోడ్‌షోతో పాటు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో, చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని వికారాబాద్‌లలో ప్రచారాల్లో పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సైతం ప్రచారాల్లో పాల్గొన్నారు. ఆ పార్టీకి చెందిన మరికొందరు జాతీయ నాయకులు రాజ్‌నాథ్ సింగ్, తేజస్వీ సూర్య, నవనీత్‌కౌర్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల సీఎంలు భూపేంద్ర పటేల్, మోహన్ యాదవ్, భజన్‌లాల్ శర్మలు సైతం పర్యటనలు చేశారంటే ఎంతటి ప్రాధాన్యమిచ్చారో ఊహించుకోవచ్చు.

రాహుల్.. ప్రియాంక.. రేవంత్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ తదితరులు పార్టీ విజయం కోసం ప్రచారాల్లో పాల్గొన్నారు. రాహుల్ గాంధీ సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బహిరంగ సభలో పాల్గొని ప్రచారం చేశారు. ప్రియాంకా గాంధీ తాండూరు, పటాన్‌చెరు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి దాదాపుగా అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేశారు.

కేసీఆర్, కేటీఆర్..

బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ బస్సు యాత్రతో చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో పర్యటించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గ్రేటర్‌లోని అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రచారం చేశారు. ఇలా ఎవరికి వారుగా అన్ని పార్టీల హేమాహేమీల ప్రచారాలకు ప్రజలు హాజరైనప్పటికీ, ఎవరికి ఓట్లేస్తారో చెప్పే పరిస్థితి లేదు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంలోనూ కాంగ్రెస్, బీజేపీల నుంచి దాదాపుగా ఇదే స్థాయిలోనేతలు వచ్చినా ఆ ప్రభావం పోలింగ్‌లో కనిపించకపోవడం తెలిసిందే.

సతుల్.. సుతుల్.. హితుల్..



రంజిత్‌రెడ్డికి మద్దతుగా భార్య సీత

- సకుటుంబ సపరివారం
- అభ్యర్థులకు అండగా.. లోక్‌సభ ఎన్నికల ప్రచారం

సాక్షి, సిటీబ్యూరో: ఎన్నికల్లో ప్రధాన పార్టీల నుంచి టికెట్ సంపాదించడం ఒక ఎత్తయితే.. లక్షలాది మంది ఓటర్లను కలసి తమకే ఓటు వేయాలని అభ్యర్థించడం అంతకంటే పెద్ద టాస్క్. దీంతో అభ్యర్థులు మాట పక్కన పెడితే వారి కుటుంబ సభ్యులు మాత్రం ప్రచారంలో పెద్ద సాహసమే చేశారని చెప్పాలి. ఏసీ గదుల నుంచి మండే ఎండల వైపు.. గేటెడ్ కమ్యూనిటీ నుంచి మురికివాడల వరకు కష్టనష్టాలను లెక్క చేయకుండా ప్రచారంలో దూసుకెళ్లారనేది స్పష్టంగా కనిపిస్తోంది. గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి నియోజకవర్గాల్లో సుడిగాలి పర్యటనలు చేశారు.



ఈటలకు మద్దతుగా సతీమణి జమున

మల్కాజిగిరిలో సునీతకు.. చేవెళ్లలో కాసానికి..

మల్కాజిగిరి కాంగ్రెస్ అభ్యర్థి సునీత తరఫున ఆమె భర్త, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు. మహేందర్‌రెడ్డికి కుమారుడు, అల్లుడు కూడా సహకరించారు. లాగే బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ భార్య జమున సైతం విస్తృతంగా పర్యటించారు. ప్రచారంలో తనకంటూ ప్రత్యేక స్థానం ఉందని చెప్పకనే చెప్పారు. బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సతీమణి చంద్రకళ, కుమారుడు కాసాని వీరేశ్ ముమ్మరంగా ప్రచారంలో పాల్గొని ఓటు వేయాలని అభ్యర్థించారు.

లష్కర్‌లో ఫ్యామిలీలదే హవా

సికింద్రాబాద్ లోక్‌సభ బరిలో నిలిచిన బీజేపీ అభ్యర్థి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి భార్య కావ్య సైతం ఆయనకు చేదోడుగా నిలిచారు. గతం నుంచి స్వచ్ఛంద సంస్థ నడిపిస్తుండటం ఆమెకు కలిసొచ్చిన అంశం. బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ప్రచారంలో ఆయన కుమారుడు రామేశ్వర్‌గౌడ్, కోడలు శిల్ప కీలకంగా వ్యవహరించారు.

అటు సీత.. ఇటు సంగీత..

చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వరరెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజితరెడ్డిలు నువ్వా నేనా అన్నట్లు ప్రచారం చేశారు. కొండా విశ్వేశ్వర్‌రెడ్డి భార్య సంగీతారెడ్డి, కుమారుడు విశ్వజిత్ ప్రచారంలో దూసుకుపోయారు. కొండా కుటుంబ సభ్యులు కొందరు విదేశాల నుంచి వచ్చి మరీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి భార్య సీత సైతం విస్తృతంగా పర్యటనలు చేశారు. పార్టీ మహిళా నాయకులతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



విశ్వేశ్వర్‌రెడ్డి సతీమణి సంగీతారెడ్డి